## హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ

**గజ్వేల్ టౌన్, మే 30 (ప్రభాతవార్త):**

ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గజ్వేల్ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సీనియర్ నాయకులు, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ నియామకమయ్యారు. ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కటకం శ్రీనివాస్ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు.

ఈ సందర్భంగా కటకం శ్రీనివాస్ మాట్లాడుతూ నంగునూరి సత్యనారాయణ రాజకీయ రంగంలో రాణిస్తూ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు, వారికి ఐహెచ్ఆర్సిఐ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం జరిగిందని అన్నారు. అనంతరం నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మానవ హక్కుల కోసం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా ద్వారా ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



### కాంగ్రెస్ పార్టీ బలోపేతానికే
## 'సంగటన్ సృజన్ అభియాన్' లక్ష్యం : ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, మే 30 ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల 'సంగటన్ సృజన్ అభియాన్' కార్యక్రమం జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన ఈ కీలక సమావేశంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యేపట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి మాట్లాడుతూ, క్షేత్రస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ 'సంగటన్ సృజన్ అభియాన్' చేపట్టడం జరిగిందన్నారు. కార్య కర్తలే పార్టీకి అసలైన బలమని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతి నిధులు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలి
### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రాష్ట్ర అవతరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని జిల్లాలో జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాల నిర్వహణపై సమీక్షించి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి శాఖల వారీగా ఏర్పాటు చేయాలన్నారు. స్టేజ్ డెకరేషన్, గ్రౌండ్ ముస్తాబు రాష్ట్ర అవతరణ ఉత్సవాలను ప్రతిబింబించేలా రూపొందించాలన్నారు. గ్రామీణ అభివృద్ధిశాఖ, గృహ నిర్మాణం, వ్యవసాయం, హార్టికల్చర్, పౌరసరఫరాలు, సోలార్ పవర్, జనగణన 2027, ప్రత్యేక ఓటర్ నమోదు, ఇతర అన్ని శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని వివరించేలా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ ఏఆర్ సుభాష్‌చంద్రబోస్, డిఆర్ఓ నాగరాజమ్మ, ఆర్డీఓ సదానందం, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు గజ్వేల్‌కు మంత్రి వివేక్ రాక

**గజ్వేల్ టౌన్, మే 30 (ప్రభాతవార్త):** పట్టణంలో ఆదివారం సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నట్లు డిసిసి అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 1 గంటలకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని, అలాగే గజ్వేల్‌లో నూతనంగా నిర్మించిన మోడల్ బస్టాండ్‌ను మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మంత్రి వివేక్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



మంత్రి వివేక్ వెంకటస్వామితో తూంకుంట నర్సారెడ్డి, నాయకులు

**గజ్వేల్ టౌన్, మే 30 (ప్రభాతవార్త):** కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని శనివారం మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నిర్వహించే కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ, నూతన బస్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. ఆయన వెంట గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి, రమేష్‌నాయక్, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, గుంటుకు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి
### అడిషనల్ కలెక్టర్ నాగేష్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

**చిలిపిచెడ్, మే 30 ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి, లేబర్ హమాలీలను పెంచాలని అడిషనల్ కలెక్టర్ నాగేష్ అధికారులను ఆదేశించారు. శనివారం చిలిపిచేడ్ మండలంలోని గౌతపూర్ గ్రామ శివారులో దక్కన్ ఆగ్రో రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోదాంను సందర్శించారు. ఈ సందర్భంగా అడిషనల్ నాగేష్ కలెక్టర్ మాట్లాడుతూ.. తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని నర్సాపూర్‌లో రెండు గోదాములకు పంపిస్తామని, మిగతావన్నీ ఆగ్రో దక్కన్ గోదాంలోనే ధాన్యం బస్తాలను ఇచ్చేస్తామన్నారు. లేబర్‌ను పెంచి లారీలోనూ, ట్రాక్టర్‌లో ఉన్న ధాన్యాన్ని దించుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ జహీర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మోడల్ పార్లమెంట్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 30, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు భాగంగా సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్నేహ(బాలికల) సంఘాల సభ్యులకు శనివారం మోడల్ పార్లమెంట్ నిర్వహించారు. శాసనపరమైన కార్యకలాపాలు ఒక విద్యాపరమైన అనుకరణ ఇందులో పాల్గొనేవారు పార్లమెంట్ సభ్యులుగా, మంత్రులుగా, సభాపతిగా పాత్రలు పోషించి, విధానాలపై చర్చించడం, బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించడం, ప్రజాస్వామ్య ప్రక్రియను ముందుకు నడిపించడం వంటివి నిర్వహించారు. నిజమైన పార్లమెంటు సమావేశాలను లేదా చట్టసభల పనితీరును అనుకరించే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్డిఓ, అడిషనల్‌డిఆర్డిఓ సంగారెడ్డి డిఎస్పి, విద్య, పోలీసుశాఖ అధికారులు, డిపిఎమ్స్ ఏపీఎంసీ, సిబ్బంది పాల్గొనారు.

## రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నేడు జేష్టపౌర్ణమి జాతర ముగింపు వేడుకలు

హుస్నాబాద్ టౌన్, మే 30, ప్రభాతవార్త : హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం లో జేష్ఠ పౌర్ణమి (భాషికాల పౌర్ణమి) జాతర ముగింపు సందర్భంగా నేడు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తెలిపారు. నేడు ఉదయం 8:00 గంటలకు సాంప్రదాయం ప్రకారం గౌడ కులస్తుల ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి, జమదగ్ని మహాముని వారి భాషికాలు విప్పే కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

# విద్యారంగానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం

### మంత్రి దామోదర రాజనర్సింహ

**సంగారెడ్డి బ్యూరో, మే 30, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతోపాటు విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మైనర్, మేజర్ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ప్రహరీ గోడల నిర్మాణం, పాఠశాల భవనాలకు ఆకర్షణీయమైన రంగులు వేయడం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలను విద్యార్థులు చూసిన వెంటనే చదువుపై ఆసక్తి పెరిగేలా, పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని మంత్రి పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలురు, బాలికల వసతి గృహాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి విద్యార్థులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల వసతి గృహాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు మరియు ఇతర అవసరమైన వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధేరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉర్దూ మీడియం ప్రారంభానికి సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో విద్యాసంస్థలు, వసతి గృహాలు కీలక పాత్ర పోషిస్తున్నందున సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, సంబంధిత శాఖల అధికారులు, ఆర్‌సీవోలు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, టి జి ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

### ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి...

**సంగారెడ్డి బ్యూరో, మే 30, ప్రభాతవార్త:**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వారం రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి రెవెన్యూ డివిజనల్ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులతో మంత్రి ధాన్యం కొనుగోలు పురోగతి పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం ఎంత మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది, ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, ఎంత మేర రైస్ మిల్లులకు తరలించారు, రైతుల ఖాతాల్లో కొనుగోలుచేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు సకాలంలో జమ అవుతున్నాయా అనేఅంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాల లభ్యత, రవాణా ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలుచేపట్టాలని మంత్రి సూచించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు అన్ని విధాల సహకరించాలని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, సబ్ కలెక్టర్ ఉమాహారతి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పారితోష్‌పంకజ్

## 3న హత్నూరకు సిఎం రాక
### హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ పారితోష్ పంకజ్

హత్నూర మే 30 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో ఈనెల 3న పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా శనివారం జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్, సీఎం ప్రారంభించనున్న పరిశ్రమ, పరిశ్రమను పరిసరాలను, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. హత్నూర మండలంలోని బోరుపట్ల గ్రామ శివారులోని నూతనంగా నిర్మించిన తెరానియం బయోజిక్స్ పరిశ్రమ ప్రారంభోత్సవాని రానుండడంతో ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రారంభోత్సవానికి సంబంధించి శిలాఫలకాల ఏర్పాట్లు సమావేశం ఏర్పాటు చేసే హాలును సైతం పరిశీలించారు.

అనంతరం పరిశ్రమ వెనుక భాగంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్లో దిగేందుకు స్థలాన్ని ఎస్పీ అధికారులతో కలిసి పరిశీలించారు.. పరిశ్రమ వెనుక భాగంలోనే ముఖ్యమంత్రి ఎలిఫర్డ్ ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి కార్యక్రమం ఇంకా అధికారికంగా వెలువడ లేదని, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారికంగా ప్రకటన వచ్చిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీతోపాటు డీఎస్పీ ప్రభాకర్, సీఐ రమణారెడ్డి, తహసీల్దార్ పర్వీన్ షేక్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ రవీందర్, ఎస్ ఐ శ్రీధర్ రెడ్డి, పరిశ్రమ ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు

## మొగుడంపల్లి నూతన ఎంఈఓగా వెంకటేశం
### పిఆర్‌టియు, తపస్ నాయకుల సన్మానం

**జహీరాబాద్, మే 30 (ప్రభాతవార్త):**

మొగుడంపల్లి మండల నూతన మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)గా వెంకటేశం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పీఆర్‌టీయూ, తపస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈఓగా నియమితులైన వెంకటేశంను పీఆర్‌టీయూ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా మాజీ ఎంఈఓ జాఫర్ అలీకి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంగారెడ్డి జిల్లా గౌరవ అధ్యక్షుడు డా. తులసి రామ్ రాథోడ్, మొగుడంపల్లి అధ్యక్షుడు అర్జున్ చవ్వాణ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, జహీరాబాద్ అర్బన్ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి తుకారామ్ చవ్వాణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి. శ్రీనివాస్, డి. విట్టల్, అసద్‌గంజ్ జీహెచ్‌ఎం తుల్జాబాయి, పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు శ్రీనివాస్, జితేందర్ ప్రభు, శేఖయ్య, దళ్‌సింగ్ రాథోడ్, జి. రమేశ్, బాబు, మదన్ మోహన్, సీఆర్‌పీ విజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో కూడా నూతన ఎంఈఓ వెంకటేశంను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, బాధ్యులు బసవరాజ్, శ్రీపాల్, మొగుడంపల్లి అధ్యక్షుడు మల్లయ్య, కార్యదర్శి స్వామి, మొగులయ్య, రాజు నాయక్, సంజీవ్ కుమార్, నరసింహారెడ్డి, గోపాల్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతల పండుగలు సంస్కృతి, సంప్రదయాలకు ప్రతీకలు

**సిద్దిపేట రూరల్ మే 30, ప్రభాతవార్త :**

గ్రామ దేవతల పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తోర్నాల గ్రామంలో శనివారం నిర్వహించిన శ్రీ పోచమ్మ దేవాలయ బోనాల మహోత్సవంలో పాల్గొని ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. శ్రీ పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలన్నారు. పోచమ్మ తల్లి దేవాలయానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. అనంతరం గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోలు తీరు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్ల ఆలస్యం అవుతుండడంతో రైతుల పడుతున్న ఇబ్బందులను గమనించి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో వర్షం కురిసే అవకాశం ఉన్నందున్న వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని కోరారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి వసంతరావు

## వరి కొయ్యలు కాలిస్తే జరిమానా తప్పదు
### -కొత్తపేట గ్రామ సభలో పాలకవర్గ తీర్మానం

**జగదేవ్‌పూర్, మే 30(ప్రభాతవార్త):** వరికొయ్యలను కాలిస్తే జరిమానా తప్పదని కొత్తపేట గ్రామ సర్పంచ్ తుమ్మల జ్యోతిమహేష్ అన్నారు. శనివారం సర్పంచ్ అధ్యక్షతన మండల వ్యవసాయాధికారి యు. వసంతరావు ఆధ్వర్యంలో వరి కొయ్యల కాల్చివేతపై గ్రామసభ నిర్వహించారు. ఈ వసంతరావు మాట్లాడుతూ వరికొయ్యలను కాల్చడంవల్ల భూమి సారవంతం తగ్గిపోతుందని, భూమిలో సేంద్రీయ కర్బనం పాడవుతూ పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, దీనివల్ల పంటల దిగుబడి తగ్గడంతో పాటు పర్యావరణం కలుషితమవుతుందన్నారు. సర్పంచ్ జ్యోతిమహేష్ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా రైతులు 5 ఎకరాలలోపు వరి కొయ్యలను కాల్చినట్లయితే రూ.5వేల జరిమానా, అంతకంటే ఎక్కువ భూమిలో కాల్చితే రూ.25వేల జరిమానా వేయాలని పాలకవర్గ మండలి, ప్రజలు తీర్మానించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అమరేందర్ రెడ్డి, ఏఈవో సమత, వార్డు సభ్యులు మహిపాల్, రైతులు పాల్గొన్నారు.



విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్ దృశ్యం

## అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

**చిలిపిచెడ్, మే 30 ప్రభాతవార్త :** మండలంలోని ఫైజాబాద్ గ్రామానికి చెందిన రైతు రమేష్ వడ్లు సిరిపురం ఆదిత్య రైస్ మిల్లుకు జోగిపేట నర్సాపూర్ ప్రధాన రహదారి గుండా తరలిస్తుండగా గంగారం శివారులో 33 కేవి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. ట్రాక్టర్ వేగంగా వెళ్తుండగా ప్రమాదశాత్తు అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టింది. కానీ ఎవరికీ ఎలాంటి అపాయం జరగకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ ఊపిరి పీల్చుకున్నాడు. విద్యుత్తు స్తంభం విరిగిపోవడంతో మండలంలోని గంగారం, అజ్జమర్రి, బండాపోతుగల్ గ్రామాలకు విద్యుత్తు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న విద్యుత్తు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్తు మరమ్మతులు చేపట్టారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ
### బంగారం, నగదు అపహరణ

**కొమురవెల్లి, మే 30, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు బంగారం, నగదు అపహరించిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పగలు–రాత్రి తేడా లేకుండా దొంగలు చోరీలకు పాల్పడుతుండటంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. వివరాల్లోకి వెళితే.. కొమురవెల్లిలోని ఇంటి యజమానులు సార్ల భానుప్రియ, సురేష్ తాళం వేసి బయటకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న మూడున్నర తులాల బంగారం, రూ.1,03,500 నగదు, పది తులాల వెండి అపహరించినట్లు సమాచారం. మధ్యాహ్న సమయంలో భోజనం కోసం ఇంటికి వచ్చిన యజమాని సార్ల సురేష్ ఇంటి తలుపుల తాళాలు పగిలి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లగా బీరువా ధ్వంసమైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యా వ్యవస్థను గాలికి వదిలేసిన ప్రభుత్వం

* 33 జిల్లాల్లో ముగ్గురే డిఇవోలు
* ఖాళీగా 30 పోస్టులు
* మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

రాష్ట్రంలో 33 జిల్లాలు ఉంటే కేవలం ముగ్గురే రెగ్యులర్ డీఈవోలు ఉన్నారని 30 పోస్టులు ఖాళీగా ఉంచి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా గాలికి వదిలేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి సంఘంలో ఓ జిల్లా అధికారి పదవీ విరమణ పొందిన సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అదనపు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, ఐఎఎస్ అధికారులకు అప్పగించడం వల్ల వారు విద్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతునా రని తక్షణమే రెగ్యులర్ డీఈవోలను నియమించాలన్నారు. రాజకీయ కక్షతో మన ఊరు..మన బడి కార్యక్రమాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి బడుల అభివృద్ధిని కుంటుపర్చిందన్నారు. పెండింగ్ బిల్లులు, డిఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుండా ఉపాధ్యాయులను తీవ్ర ఆర్థిక క్షోభకు గురిచేస్తున్నారని వాపోయారు. పాఠశాలల్లో స్కావెంజర్ల బిల్లులు గత ఏడాదివి నాలుగు నెలలు, ఈ ఏడాది నాలుగు నెలలు పెండింగ్‌లో పెట్టడడంతో భారం హెచ్ఎంలు, ఉపాధ్యాయులపై పడుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొండం సంపత్‌రెడ్డి, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, నాగర్జునారెడ్డి, వంగ తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

### పోచమ్మ తల్లి ఆలయంలో పూజలు...

**సిద్దిపేట రూరల్, మే 30, ప్రభాతవార్త :**

సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీపోచమ్మ దేవాలయ ఉత్సవాలలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోచమ్మ తల్లి ఆశీస్సులతో నియోజకవర్గంతో పాటు రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని రైతులు పాడిపంటలతో సస్యశ్యామలంగా ఉండాలని వేడుకున్నారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించినట్లు గుర్తు చేశారు. అలాగే రాఘవపూర్ గ్రామంలోని ఇంద్రగూడెం తూము మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగించడానికి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సిద్దిపేట ఫొటోగ్రాఫర్ల వెడ్డింగ్ ఫొటోగ్రాఫీ బిజినెస్ వర్క్‌షాప్‌లో పాల్గొని మాట్లాడారు. అలాగే సిద్దిపేటలోని టీటీసీ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా కోచెస్ అండ్ జడ్జెస్ శిక్షణాశిబిరం ముగింపు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగాయే దివ్యౌషధం అన్నారు.

## అమరుల వారోత్సవాలను విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాగభూషణం

సైఫాబాద్, మే 30 ప్రభాతవార్త: తెలంగాణ సాధనకు ప్రాణాలను అర్పించిన అమరులను స్మరించుకుంటూ వారోత్స వాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమోని నాగభూషణం చెప్పారు. ఇటీవల బెల్లి లలితక్కకు వర్ధంతి నిర్వహించామని, జూన్ 2వ తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరుల వారోత్స వాలను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం గన్‌పార్కులో ఈ వారోత్స వాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ నాయకులు కడమంచి రాంబాబు, ముత్తన్న, కొల్లూరు అంజయ్య, గోపాల పాల్గొన్నారు.

## తల్లి కొడుకులకు వరల్డ్ గిన్నిస్ రికార్డ్ గుర్తింపు



తల్లి, కొడుకులకు వరల్డ్ రికార్డ్ గుర్తింపు సర్టిఫికేట్లు అందజేస్తున్న పాస్టర్ ఆగిస్టిన్ దండింగ్

సైఫాబాద్, మే 30 ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని హలెల్ మ్యూజిక్ స్కూల్‌లో 777 విద్యార్థులతో నిర్వహించిన ఎలక్ట్రానిక్ కీబోర్డు వరల్డ్ గిన్నిస్ రికార్డ్ కార్యక్రమం విక్టరి ఆడిటోరియంలో జరిగింది. ఇందులో తల్లి కొడుకు పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికేట్లును సాధించారు. మదీనాగూడలోని జెనెసిస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న డెనియల్ ఆండ్రూ జగడం రెండోవ సారి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి గుర్తింపు పొందగా, తల్లి రుబినా తొలిసారిగా గిన్నిస్ రికార్డ్ సాధించి గుర్తింపు పొందారు. వీరు రెవరెండ్ డా.జాయ్ చెరియన్ నేతృత్వంలోని యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ సంఘ సభ్యులు. ఈ కార్యక్రమాన్ని హలెల్ మ్యూజిక్ స్కూల్ స్థాపకులు పాస్టర్ ఆగస్టిన్ దండింగి నిర్వహించారు. వారికి సర్టిఫికేట్లను ఆగస్టియన్ ప్రదానం చేశారు.

## అర్హులైన ఓటర్‌ల పేర్లు పోకుండా చూడాలి

: ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



నేతలతో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, మే 30 ప్రభాతవార్త:
బీ.ఆర్.ఎస్. పార్టీ నేతలు అప్రమతంగా వ్యవహరించి ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో అర్హుల ఓట్లు పోకుండా జాగ్రత్త పడాలని సికింద్రాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. జూన్ 3న సికింద్రాబాద్ నియోజకవర్గ బీ.ఆర్.ఎస్. పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరగనున్న నేపథ్యం లో శనివారం తార్నాక మునిసిపల్ డివిజన్ బీ.ఆర్.ఎస్. పోలింగ్ బూత్ కమిటీలు, ముఖ్య నేతల సమావేశం సితఫలమండీలోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ జూన్ 3వ తేదిన ఉదయం 9 గంటలకు సితాఫలమండీలో బీ.ఆర్.ఎస్. ప్రతినిధుల సమావేశం నిర్వహించ నున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసేందుకు ముఖ్య అతిధిగా బీ.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు హాజరవుతారని, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహ్మూద్ అలీ, శాసనసభ్యులు ముటా గోపాల్, కాలేరు వెంకటేష్‌లతో పాటు నేతలు పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు విధిగా ఈ సమావేశానికి హాజరు కావాలని సమావేశంలో ప్రసంగించిన బీఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. సమా వేశంలో సమన్వయకర్తలు,మాజీకార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

### 31న ఆర్టీసి ఉద్యోగులు డిమాండ్ డే ను పాటించాలి : జెఏసి

చిక్కడపల్లి మే 30 ( ప్రభాతవార్త ) : ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం కోసం జూన్ 2న అపాయింటెడ్ డేట్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న కార్మికులందరూ డిమాండ్ డే ను పాటించాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జేఏసీ నాయకులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కోకన్వీనర్ బి.యాదగిరి మాట్లాడారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి చర్యలు చేపట్టి శాసనసభలో బిల్లు కూడా పాస్ చేసిందని గుర్తు చేశారు. కేవలం విలీన తేదీని ప్రకటించాల్సిన సమయంలో ప్రభుత్వాలు మారాయని తెలిపారు. ఇటీవల ఆర్టీసీ సమ్మె సందర్భంగా మంత్రులతో కూడిన ఉపసంఘం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయటానికి అధికారికంగా ప్రకటన చేశారని తెలిపారు. ఇటీవల విలీనం కంటే ముందు ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో కార్మికుల్లో తీవ్ర గందరగోళం నెలకొన్నదని అన్నారు. ఆర్టీసీ విలీనానికి అపాయింటెడ్ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2న ముఖ్యమంత్రి ప్రకటించాలని కోరుతూ మే 31 న సింగిల్ డిమాండ్ పై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపో, యూనిట్లలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి డిమాండ్ డే పాటించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎం.ఎస్.అలీ, డి.గోపాల్, జె.రాఘవులు, బుద్ధ విశాల్, మనోహర్, ఎ.ఎస్.రెడ్డి, జనార్దన్, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా సత్యసాయి మందిర వార్షికోత్సవ వేడుకలు



బాలబాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శన

సికింద్రాబాద్, మే 30 ప్రభాతవార్త:
సికింద్రాబాద్ పద్మారావునగర్ హమాలీ బస్తీ హనుమాన్ ఆలయ ప్రాంగణంలోని శ్రీ సత్యసాయి మందిర 32వ వార్షికోత్స వ వేడుకలు శ్రీ సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బాలవికాస్ ప్రతిభా కార్యక్రమంలో బాలబాలికల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేముల హంసిక గణపతి ప్రార్థన నృత్యంతో ప్రారంభమైన ఈ వేడుకలు, పూర్వ విద్యార్థుల కూచిపూడి నృత్యంతో ముగిశాయి. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, మానవతా విలువలపై అవగాహన కోసం నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతాఫల్‌మండి ఇన్‌చార్జ్ లలితా మాధవరావు, శివం ఇన్‌చార్జ్ హరిహరన్, శ్రీప్రసాద్, హైమవతి, సుధామాధవి, దేవిక, సుబ్బలక్ష్మి, శ్రీ సాయి విద్యాలయ కరస్పాండెంట్ వెంకటేష్, గురువులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## హెబ్రోన్ చర్చిలో అఖిల భారత యౌవనస్థుల కూటములు

చిక్కడపల్లి మే 30 ( ప్రభాతవార్త ) : గోల్కొండ చౌరస్తాలోని ప్రముఖ క్రైస్తవ కేంద్రమైన హెబ్రోన్ చర్చిలో గత ఆరు రోజులుగా జరుగుతున్న అఖిల భారత యౌవనస్థుల కూటములు ఆదివారం (రేపటితో) ఘనంగా ముగియనున్నాయి. శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. బ్రదర్ భక్తసింగ్ స్థాపించిన ఈ కేంద్రంలో ప్రతి ఏడాది లాగే ఈ సంవత్సరం కూడా ఈ నెల 26వ తేదీన ప్రారంభమైన ఈ ప్రత్యేక సభలకు దేశ నలుమూలల నుండి సుమారు 10 వేల నుంచి 15 వేల మంది వరకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా హెబ్రోన్ చర్చి సొసైటీ చైర్మన్ జి. జాన్ సుందర్‌రావు, అధికార ప్రతినిధి రాగి వీరాచారి శనివారం మీడియాతో మాట్లాడారు. దేశంలోని యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, క్రమశిక్షణతో కూడిన సన్మార్గంలో నడిచేలా ఈ ఆరు రోజుల పాటు ప్రత్యేక బోధనలు చేసినట్లు వారు తెలిపారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన యువతీ యువకులకు చర్చి ప్రాంగణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల వసతులు, ప్రత్యేక ఏర్పాట్లు కల్పించినట్లు వివరించారు. ఈ మహాసభలు అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డికి, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు సొసైటీ ప్రతినిధులు యేసుక్రీస్తు నామములో ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే సభలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా, భద్రతా పరంగా పూర్తి సహకారం అందించిన చిక్కడపల్లి ఏసీపీ రణవీర్ రెడ్డి, చిక్కడపల్లి సీఐ, ముషీరాబాద్ సీఐ, చిక్కడపల్లి ట్రాఫిక్ సిఐ లకు ధన్యవాదాలు తెలిపారు.




అఖిల భారత యౌవనస్థుల కూటముల ప్రదర్శన నిర్వహించిన దృశ్యం

## పాల ఉత్పత్తులు,పాడి రక్షణపై ముగిసిన శిక్షణ

-మహిళలను అభినందించిన వైస్ చాన్సలర్ జ్ఞాన ప్రకాష్

అత్తాపూర్ మే30,ప్రభాతవార్త :
మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే స్వయం ఉపాధి కొరకు వివిధ రంగాలలో శిక్షణలు పొందాలని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జ్ఞాన ప్రకాష్ పేర్కొన్నారు.జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి నాబార్డ్ బ్యాంకు వారి ఆర్థిక సహకారంతో ఎస్ అండ్ టి సిరి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో గల 30 మంది ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు శిక్షణ పూర్తి పూర్తిచేసుకుని పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ సందర్శనకు వచ్చిన మహిళలను వైస్ ఛాన్సలర్ జ్ఞాన ప్రకాష్ అభినందించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పాలు ,పాల పదార్థాలు ఉత్పత్తులు పాడి సంరక్షణ అంశంపై గత పది రోజులుగా శిక్షణ ను గురించి ఫీడ్‌బ్యాక్ తెలుసుకున్న మహిళలు గ్రూపుగా ఏర్పడి మహిళలు పాలు పాల పదార్థాలు ఉత్పత్తులను రూపొందించి బ్రాండింగ్ ప్యాకింగ్ చేసి యాదాద్రిలో గల దేవస్థానంలో దాని



హైదరాబాదులో గాని ఇతర పెద్ద పెద్ద పట్టణాలలో మార్కెటింగ్ చేసుకునే విధంగా అవగాహన కలిగి ఉండాలని పాల పదార్థాలను ముఖ్యంగా పరిశుభ్రంగా ఉండే విధంగా రూపొందించుకోవాలని తెలిపారు .ఈ కార్యక్రమం నిర్వహించిన సిరి స్వచ్ఛంద సేవా సంస్థను అధ్యక్షులు ఎదునూరు శ్రీనివాస ను అభినందించినారు ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ కిషన్ కుమార్ , అసోసియేట్ డీన్ కాలేజ్ ఆఫ్ వెటర్నరీ డాక్టర్ మాధురి , అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాహిత్య ఫ్యాకల్టీ రాణి స్నేహ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రుల పనితీరు గ్రేడింగ్‌లో ప్రథమ స్థానంలో నిలవటం అభినందనీయం

-కిషన్‌రెడ్డికి అభినందనలు తెలిపిన బిజెపి ఓబిసీ మోర్చా సోషల్ మీడియా నేషనల్ సభ్యులు

హైదరాబాద్, మే 30, ప్రభాతవార్త: కేంద్ర మంత్రుల పనితీరు గ్రేడింగ్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి నెంబర్ వన్ ర్యాంక్ సాధించటం అభినందనీయమని బీజేపీ ఓబీసీ మోర్చా సోషల్ మీడియా నేషనల్ సభ్యులు పెరిగ సురేష్ కొనియాడారు. ఈ మేరకు శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి, కిషన్‌రెడ్డికి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ప్రధాని మోదీ మంత్రి వర్గంలో కిషన్‌రెడ్డి నెంబర్ వన్ స్థానంలో ఉండటం ఆయన పరిపాలనా నైపుణ్యానికి, అంకిత భావానికి నిదర్శనమని అన్నారు. దేశాభివృద్ధి లక్ష్యంగా ప్రధాని మోదీ చేపట్టిన వికసిత భారత్ సంకల్ప సాధనలో కిషన్‌రెడ్డి సమర్థవంతంగా పనిచేస్తూ విశిష్ట సేవలు అందిస్తున్నారని,



కిషన్‌రెడ్డికి అభినందనలు తెలుపుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా సోషల్ మీడియా జాతీయ సభ్యులు పెరిగ సురేష్

తెలంగాణ గర్వించదగిన నాయకుడిగా, అంకిత భావంతో సేవలందిస్తున్న కిషన్‌రెడ్డి పేరు దేశవ్యాప్తంగా నిలిచిందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంక ర్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర మీడియా విభాగం ఛీఫ్ ఎన్.వి.సుభాష్ తదితరులు పాల్గొని కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## మార్నింగ్ వాక్ చేస్తున్న మహిళలే టార్గెట్..

### చైన్ స్నాచింగ్ ముఠా గుట్టురట్టు

కుత్బుల్లాపూర్, మే 30, ప్రభాతవార్త
ఉదయం వేళ వాకింగ్కు వెళ్లే ఒంటరి మహిళలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఓ చైన్ స్నాచింగ్, దోపిడీ ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. జీడిమెట్ల, సీసీఎస్ కుత్బుల్లాపూర్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టి ఓ బాలుడు సహా నలుగురు సభ్యులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.5 లక్షల విలువైన బంగారు గొలుసు, ఆటో, స్కూటర్, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి శనివారం జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 26న ఉదయం 5 గంటల సమయంలో చింతల్‌కు చెందిన శ్రీలత అనే మహిళ బీరప్ప నగర్ నుంచి కుత్బుల్లాపూర్ వైపు జీహెచ్ఎంసీ కార్యాలయం సమీపంలో వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి ఓ ఆటో వచ్చింది. అందులో ఉన్న ఓ వ్యక్తి కిందకి దిగి ఆమె మెడలోని 2 తులాల బంగారు గొలుసును, మొబైల్‌ను బలవంతంగా లాక్కొన్నాడు. ప్రతిఘటించిన ఆమెపై దాడి చేసి స్వల్ప గాయాలపాలు చేశాడు. ఆ సమయంలో ఆటోలో మొత్తం ఐదుగురు వ్యక్తులు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీఎస్ కుత్బుల్లాపూర్, జీడిమెట్ల క్రైమ్ టీమ్‌తో కలిపి 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, పాత నేరస్తుల చరిత్ర, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను ఎల్లమ్మబండలోని సిక్కు బస్తీలో అదుపులోకి తీసుకున్నారు. నిందితులను గోవింద్ సింగ్ అలియాస్ డాంక్ గోవింద్ సింగ్ (24), కరణ్ సింగ్ అలియాస్ భువాని కరణ్ సింగ్(21), హర్దీప్ సింగ్(19)తో పాటు ఒక బాలుడిగా పోలీసులు గుర్తించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితులపై గతంలో కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి, జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. వీరి నుంచి దొంగిలించిన 2 తులాల బంగారు గొలుసు, ఆటో, హోండా డియో స్కూటర్, మొబైల్ ఫోన్ (మొత్తం విలువ రూ.5 లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన కుత్బుల్లాపూర్ డివిజన్ ఏసీపీ బాల గంగిరెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ నాగేంద్రరావు, జీడిమెట్ల ఇన్స్పెక్టర్ మల్లేష్, ఇతర ఎస్సైలు, కానిస్టేబుల్ సిబ్బందిని కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ ఎస్. కోటిరెడ్డి (ఐపీఎస్) ప్రత్యేకంగా అభినందించారు.

## కళావైభవం విరసిల్లిన కురుగంటి నృత్యోత్సవం



మనస్విత నృత్యప్రదర్శనలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, మే 30 ప్రభాతవార్త :
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, కురుగంటి కళాక్షేత్రం, కురుగంటి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సంస్థ 29వ వార్షికోత్స వ వేడుకలను పురస్కరించుకుని సంస్థ శిష్యులచే ప్రదర్శింపబడిన నృత్యోత్సవం కళావైభవాన్ని చాటిచెప్పాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి తంగిరాల నరేష్, కమల్, ఝాన్సీ రామ్, కురుగంటి రాధిక తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి నృత్యోత్స వాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కురుగంటి కళాక్షేత్రం, ఛారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులు సుమారు 50మందిచే కూచిపూడి నృత్యశైలిలో ప్రదర్శింపబడిన ఆనందన నర్తన గణపతిం, శివతాండవ స్తోత్రం, దశావతారశబ్దం, అన్నమయ్య కీర్తనలు, కూచిపూడి కథక్ జుగల్బంది నృత్యాలు సభికులను ఎంతగానో ఆహ్లాదపరిచి కళాప్రపంచంలో విహరింపజేశాయి. సభకుముందు డా. ఎం.మనస్విత, కె.శాన్వి, పి.నీహారిక నృత్యప్రదర్శనలు వీక్షకులను తన్మయుల్ని చేశాయి.

## బోయిన్ పైజాన్ స్కూల్ రహదారి ఏర్పాటుకు సర్వే



బోయిన్‌పల్లి ప్రధాన రహదారిలో సర్వే నిర్వహిస్తున్నకంటోన్మెంట్ ఇంజనీర్లు రాజేశ్వర్,బోర్డు మాజీ వి.పి. జంపనప్రతాప్

కంటోన్మెంట్,మే 30 ప్రభాతవార్త:
బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ ప్రధాన రహదారి నుంచి ఫైజాన్ హై స్కూల్ వరకు రహదారి నిర్మాణం విషయంపై సర్వే నిర్వహించాలని బోర్డు సిఈఓ అరవింద్‌కుమార్ ద్వివేది ఆదేశాల మేరకు శనివారం బోర్డు ఇంజనీర్ రాజేశ్వర్, మాజీ వి.పి. జంపనప్రతాప్,ముస్లిం బోర్డు పెద్దలతో కలిసి సర్వే నిర్వహించారు. గత కొన్ని సంవత్స రాల నుంచి న్యూ బోయిన్‌పల్లిలోని ఫైజాన్ హై స్కూల్‌కు మిలటరీ క్వార్టర్స్‌లోనికి రహదారి గుండా రాకపోకలు సాగించే వారు కరోనా సమయంలో మిలటరీ అధికారుల క్వార్టర్స్ మీదుగా పాఠశాలకు వెళ్లే రహదారిని మూసివేశారు.దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ రహదారిని ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్ రెడ్డికి విన్నవించుకోగా సిఈఓ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం బోర్డు అధ్యక్షుడు రెహమాన్, షకీబ్,ఖాదర్ పాషా పాల్గొన్నారు.

## భారతీయ శాస్త్రీయ కళల వైభవం నృత్యసంగీత సమ్మేళనం




సంగీత నృత్యసమ్మేళనంలో ప్రదర్శనలిచ్చిన చిన్నారి కళాకారులు

నాంపల్లి, మే 30 ప్రభాతవార్త : భారతీయ శాస్త్రీయ కళల వైభవానికి ప్రముఖ నాట్యాచారిణి యశస్వినిశ్రీ నేతృత్వంలో ఉషాణ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులు నేత్రపర్వంగా కావించిన విశిష్ట సాంస్కృతిక ప్రదర్శనలు నృత్య సంగీత సమ్మేళనం విజయవంతంగా నిర్వహించబడింది. సంస్థ ద్వితీయ వార్షికోత్స వాన్ని పురస్కరించుకొని నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ఘనంగా జరిగాయి. వివిధ అంశాలతో సాగిన సంగీతం, నృత్యం భారతీయ శాస్త్రీయ కళారూపాల సమ్మేళనంగా ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సమ్మేళనంలో కర్ణాటక సంగీత సంప్రదాయ రీతిలో వివిధ రాగాలు, తాళాలు, సంగీత కృతులతో కూడిన ప్రత్యేక ప్రదర్శనలు కూచిపూడి నృత్యశైలిలో సమన్వయం చేస్తూ విద్యార్థుల అద్భుత ప్రదర్శనలు వీనులవిందు చేశాయి. కర్ణాటక సంగీతంలోని భావం, లయ, రాగ వైభవం కూచిపూడి నాట్యంలోని ఆంగికాభినయం, సాత్వికాభినయం, నృత్త భంగిమలతో మిళితమై ఆహుతులైన కళా ఔత్సాహిక ప్రేక్షకులకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక దివ్యానుభూతిని అందించాయి. నాట్యాచారిణి యశస్వినిశ్రీ నట్టువాంగం, సంజన గాత్రం, వరుణ్ రవిచందర్ మృదంగం, గణేష్ ఆనంద్ వయోలిన్‌తో అద్భుత వాద్యసంగీతాన్ని అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. ఈ నృత్య సంగీత సమ్మేళనం యువకళాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చిన ఒక మహత్తర వేదికగా అలరించింది.

## సిఎం చొరవతోనే జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారం : మొగుళ్ళ రాజిరెడ్డి

హైదరాబాద్, మే 30 ప్రభాతవార్త :
సిఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే జలమండలి ఉద్యోగుల సమస్యల పరిష్కారమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. సంజీవరెడ్డినగర్ జలమండలి డివిజన్ కార్యాలయంలో శనివారం జలమండలి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి త్రిశూలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల హక్కులను గౌరవిస్తూ, జలమండలిలో గుర్తింపు సంఘం ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తుందని, ఐఎన్‌టీయూసీ విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని, జలమండలి యాజమాన్యంతో చేర్చించి లీవ్ ఎన్కషమెంట్, ఉద్యోగులకు బోర్డు వ్యవస్థాపక దినోత్స వం సందర్భంగా ప్రకటించిన క్యాష్ ఇన్సెంటివ్, యూనిఫామ్, ఓటీ కంపెన్సేషన్, జనరల్ ట్రాన్స్ సెక్షన్ టు సెక్షన్ ఇబ్బంది కాకుండా ట్రాన్స్ సీనియర్ అసిస్టెంట్ పి ఎ, ఎఫ్ ఎ టూ ఆఫీసర్ ప్రమోషన్స్, ఇన్ ఆపరేటివ్ పాన్, ఆధార్ వల్ల 3 కోట్ల పైచిలుకు చిన్న స్థాయి ఉద్యోగులపై భారం పడకుండా మాఫీ వంటి అనేక సమస్యలు తన నేతృత్వంలో యూనియన్ పరిష్కరించబడ్డాయని తెలిపారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం జలమండలి కార్మికుల ఏఒక్క సమస్యను పరిష్కరించలేదని, బిఆర్ఎస్ అనుబందంగా ఉన్న వాటర్ వర్క్స్ కంగారు యూనియన్ అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ ఏఒక్క సమస్యను పరిష్కరించకుండా జలమండలి కార్మికులకు మోసం చేసాడని,ఆయనను చిత్తుగా ఓడించాలని అయన కోరారు. జూన్ 6న జరిగే జలమండలి గుర్తిపు కార్మిక సంఘం ఎన్నికల్లో త్రిశూలం గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో



సభలో మాట్లాడుతున్న మొగుళ్ళ రాజిరెడ్డి

గెలిపించాలని రాజిరెడ్డి కోరారు. ఈ సభలో ఐఎన్‌టీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు జి. సత్యజిత్‌రెడ్డి, టీజేఈయూ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవాన్ కుమార్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ ఈ.చంద్రశేఖర్, మేవ అధ్యక్షుడు సయ్యిద్ అక్తర్‌అలీ, ఏఐటీయూసీ నాయకులూ రమేష్, యూనియన్ నాయకులు బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

**బాగ్ లింగంపల్లి వివిస్టి వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో**

ఉద్యోగుల సంక్షేమం, హక్కుల సాధన కోసం పని చేస్తానని తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) అధ్యక్షుడు మొగుళ్ళ రాజి రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం బాగ్ లింగంపల్లి వివిస్టి వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) అధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజి రెడ్డి నేతృత్వంలో త్రిశూల్ గుర్తు ఎన్నికల నిర్వహణ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిల్ షరీఫ్, జలమండలి యూనియన్ ఎన్నికల ఇన్‌ఛార్జ్ బొంతు రామ్మోహన్‌తో పాటు పెద్ద సంఖ్యలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగ ప్రతినిధులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

### మొక్కలు నాటిన ఆదాయపు పన్ను శాఖ అధికారులు



ఇన్‌కంటాక్స్ కాలనీలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న సురేష్ బట్టిని.

జూబ్లీహిల్స్, మే 30, ప్రభాతవార్తః
బంజారాహిల్స్ రోడ్ నెం.10, 12లో ఉన్న ఆదాయపు పన్ను కాలనీలలో ఆంధ్రప్రదేశ్-తెలంగాణ ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ స్థాయిలో మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, సమాజ సంక్షేమం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏపీ, తెలంగాణ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ సురేష్ బట్టిని ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (ఇన్వెస్టిగేషన్) రాజర్షి ద్వివేది, కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ (అడ్మిన్ అండ్ టీపీఎస్) సరిష్ కుమార్ ఇరుకుల్లతో పాటు శాఖకు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ బట్టిని మాట్లాడుతూ కాలనీల్లో నివసించే చిన్నారులు, వృద్ధులకు ఉపయోగపడే విధంగా పండ్ల చెట్లను ఎక్కువగా నాటాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు పోషకాహార ప్రయోజనాలు అందించేలా పచ్చదనాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పర్యావరణ బాధ్యతను ప్రోత్సహిస్తూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, స్థిరమైన పచ్చని వాతావరణాన్ని అందించాలనే ఆదాయపు పన్ను శాఖ సంకల్పానికిఈకార్యక్రమం నిదర్శనంగా నిలిచిందని అధికారులు అన్నారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం



అత్తాపూర్ మే30,ప్రభాతవార్త :
ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం లో ఆఫీస్ సబ్ ఆర్డినేట్ గా పని చేస్తున్న హరి సింగ్, డ్రైవర్ గా పని చేస్తున్న ఈ. లక్ష్మీ నారాయణ లు ఈ నెల 31 వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా పరిపాలనా భవనం కమిటీ హాల్‌లో వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.దీనికి ముఖ్య అతిధిగా హాజరు అయిన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ వారిద్దర్నీ సన్మానించారు.సుదీర్ఘ కాలం వారిద్దరూ విశ్వవిద్యాలయానికి అందించిన సేవలని కొనియాడారు. ప్రతి ఉద్యోగి తన విధులని నీతి, నిజాయితీ లతో నిర్వర్తించినపుడే వ్యక్తి గత పురోగతి, సంస్థ పురోగతి సాధ్యం అవుతుందని రిజిస్ట్రార్ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బోధన, బోధనేతర సిబ్బంది హరిసింగ్, లక్ష్మీ నారాయణ లతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.వారు విశ్వ విద్యాలయానికి అందించిన సేవలని అభినందించారు. అదేవిధంగా నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్లో సీనియర్ లైబ్రరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వలిహుస్సేన్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా నాలెడ్జ్ మేనేజ్మెంట్ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వలి హుస్సేన్ ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్ తో పాటు గ్రంథాలయ సిబ్బంది, శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు.

### బంజారాహిల్స్‌లో 46 గ్రాముల గంజాయి స్వాధీనం

జూబ్లీహిల్స్, మే 30, ప్రభాతవార్తః
బంజారాహిల్స్ లోని భోలా నగర్ ప్రాంతంలో చరస్ మాదకద్రవ్యాన్ని వినియోగిస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 46 గ్రాముల చరస్‌ను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం, బంజారాహిల్స్ భోలా నగర్ సమీపంలో నిఘా ఏర్పాటు చేసిన పోలీసులు, ఒక అనుమానితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెంది భోలానగర్‌లో నివసిస్తున్న షేక్ ఆరిఫ్ అబ్దుల్ సలీమ్ అలియాస్ దావూద్ అలియాస్ దావూద్ ఖురేషి (28)గా గుర్తించారు. మహారాష్ట్రలోని పరభణి ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి రూ.12 వేలకు సుమారు 46 గ్రాముల చరస్ కొనుగోలు చేసినట్లు నిందితుడు విచారణలో అంగీకరించాడు. అతని వద్ద ఉన్న బ్యాగ్ లో పోలీసులు చరస్‌ను గుర్తించారు. అతని నుంచి ఒక మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలో ఒకరు అరెస్ట్, నగదు స్వాధీనం

గోషామహల్,మే30ప్రభాతవార్త: చట్ట విరుద్ధంగా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఓ ముఠాలోని ఒకరినిఅరెస్ట్,చేసి నగదుతోపాటు సెల్‌ఫోను గోషామహల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఇన్‌స్పెక్టర్ బి.శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం... బేగంబజార్ నారాయణ్‌భవన్‌లో అక్రమంగా ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు.అందులో వేణుగోపాల్‌శర్మఎలియాస్ ఇడ్లీ వేణును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఇతడు తనిఖీ సమయంలో నిందితుడు వాట్సాప్,ఇతర కమ్యూనికేషన్,మాధ్యమాల ద్వారా బెట్టింగ్ కార్యకాలాపాలు నిర్వహిస్తూ పట్టుబడ్డాడు.ఇడ్లీ వేణు గోదావరి అసోసియేషన్ పేరుతో క్రికెట్ బెట్టింగ్,రేస్‌కోర్సు బెట్టింగ్‌లను నిర్వహిస్తున్నట్లు అంగీకరించినట్లు చెప్పారు.మధ్యవర్తుల ద్వారా పంటర్ల నుండి బెట్టింగ్ సొమ్మును వసూలుచేస్తున్నట్లు అంగీకరించారు.అంతేకాకుండా సాక్ష్యాలను దాచడానికి బెట్టింగ్ సంబంధించిన వాట్సాప్ చాట్‌లను కూడా డీలిట్ చేసినట్లు పోలీసుల విచారణలో తెలింది.చార్మినార్ పోలీస్ స్టేషన్ పరిధిలోకూడా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న కేసుల్లో నిందితుడన్నారు .అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కుతరలించారు.ఈ కేసును గోల్కొండ జోన్ డిసిపి జి.చంద్రమోహన్ ఆధ్వర్యంలో గోషామహల్ ఎ.సి.పి.కె.చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో గోషామహల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కాగా ప్రజలకు గోషామహల్‌పోలీసులు విజ్ఞప్తి చేశారు.ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడే ఆటగాళ్ల నిర్వాహకులు,ప్రోత్సాహించే వ్యక్తులపైకఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ఆన్‌లైన్ కార్యకాలపాలనునిరంతరం గమనిస్తూ,బెట్టింగ్ వల్ల వచ్చే నష్టాలు,చట్టపరమైన చర్యలపై కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ప్రజలు,ముఖ్యంగా యువకులు బెట్టింగ్ లేదా జూదా క్రీడాల్లో పాల్గొనవద్దని,ఇటువంటి చట్ట విరుద్ధమైన పనుల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలుపాలని కోరారు.

### యువత క్రమశిక్షణ ,దేశభక్తి భావాలు పెంపొందించుకోవాలి

అత్తాపూర్ మే30,ప్రభాతవార్త :
యువతలో ధైర్యం, క్రమశిక్షణ, దేశభక్తి, ఆత్మరక్షణ భావనలను పెంపొందించాలనే లక్ష్యంతో కర్ర సాము శిక్షణ తరగతులను నిర్వహించినట్టు గౌతమ్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ చైర్మన్ డాక్టర్ బాలరాజ్ ముదిరాజ్ వెల్లడించారు. సంస్థ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా 200 మంది యువతీ,యువకులకు ఉచితంగా కర్ర సాము, కత్తి సాములో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించారు. రాజేంద్రనగర్ వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ముగింపు కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. 200 మంది యువతి యువకులు తాము శిక్షణ పొందిన కర్ర సాము, కత్తి సాము విన్యాసాలను ప్రదర్శించారు. శిక్షణలో పాల్గొ న్నా వారందరికీ సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలరాజ్ ముదిరాజ్ హైకోర్టు న్యాయవాది నరేష్ రెడ్డి,చార్మినార్ బాగ్ ఆర్ఎస్ఎస్ కార్యవాహ రంగా రామాంజనేయులు , శిక్షణ పొందిన వారితో పాటు వారి కుటుంబ సభ్యులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సిఐటియు జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నేత బాల్‌నర్సయ్య

## కార్మికుల హక్కుల సాధనకు సిఐటియు నిరంతరం పోరాటం : బాల్‌నర్సయ్య

**కొండపాక, మే 30, ప్రభాతవార్త :** కార్మికుల హక్కుల కోసం నిరంతరం సిఐటియు పోరాటాలు చేస్తుందని జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల బాల్‌నర్సయ్య అన్నారు. శనివారం సిఐటియు 56 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొండపాక మండల పరిధిలోని వెలికట్ట, దమ్మక్కపల్లి, మర్పడ్గ గ్రామాల్లో, కొండపాక మండల సమీకృత కార్యాలయ సముదాయం వద్ద సిఐటియు జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికవర్గ హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్యం, మత సామరస్యం సామాజిక న్యాయం, సమసమాజ నిర్మాణమే లక్ష్యంగా సిఐటియు పని చేస్తుందన్నారు. కార్మికుల హక్కుల కోసం విడివిడిగా ఉంటున్న కార్మికులందరిని ఐక్యంచేసి వారి హక్కుల సాధన కోసం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు బర్ల కొమురయ్య, భక్తి ఎల్లయ్య, ఆకారం రవి, దున్న మహేష్, దున్న యాదగిరి, జాలిగామ ప్రభాకర్, తుప్పుడు సంతోష్, పల్లె శ్రీనివాస్, మల్లేశం, నర్సవ్వ, కనకయ్య, రజిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు లేకుండానే పౌరహక్కుల దినోత్సవం

**మర్కుక్, మే 30 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొండిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం ప్రజల భాగస్వామ్యం లేకుండానే ముగిసింది. ప్రజల్లో పౌర హక్కులపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామస్తుల నుండి ఆశించిన స్థాయిలో స్పందన కనిపించలేదు. గ్రామ సర్పంచ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఐ దామోదర్, ఆర్ఐ బాలయ్య పాల్గొన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన కార్యక్రమాలకు ముందస్తు ప్రచారం, ప్రజల భాగస్వామ్యం పెంచే చర్యలు అవసరమని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం



పదవి విరమణ పొందిన ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, మే 30, ప్రభాతవార్త :** కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో విశిష్ట సేవలందించి పదవీవిమరణ పొందిన స్థానాచార్యులు పడిగన్న బాలమణి, మల్లయ్య, సహాయ కార్యనిర్వహణాధికారి రమాదేవి, రావుల సుదర్శన్‌గౌడ్‌లకు శనివారం మల్లికార్జున గార్డెన్స్‌లో ఆత్మీయ అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు, అభిమానులు పాల్గొని పదవి విరమణ పొందిన అధికారులను ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజలింగం, దేవాలయ మాజీ చైర్మన్ గంగం నరసింహారెడ్డి, దేవాలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, జిల్లా లింగ బలిజ సమాజం అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, ఆలయ ఎఈవో బుద్ధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో అగ్నివీర్ పరీక్షలు రాయాలి : సిఐ



అభ్యర్థులకు అడ్మిట్ కార్డులను అందజేస్తున్న సిఐ రవికుమార్

**గజ్వేల్ టౌన్, మే 30 (ప్రభాతవార్త):** భారత ఆర్మీ నిర్వహించే అగ్నివీర్ నియామక పరీక్షలకు హాజరుకానున్న అభ్యర్థులకు శనివారం గజ్వేల్‌లోని ఆజాద్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అడ్మిట్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గజ్వేల్ సిఐ రవికుమార్ అభ్యర్థులకు అడ్మిట్ కార్డులు అందజేసి మాట్లాడారు. అగ్నివీర్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. దేశ సేవకు అవకాశం కల్పించే ఆర్మీ ఉద్యోగాలను యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఆర్మీలో చేరాలని ఆకాంక్షించారు. అడ్మిట్ కార్డులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ అకాడమీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అందుబాటులో సబ్సిడీపై జనుము విత్తనాలు

**కొల్చారం, మే 30 ప్రభాతవార్త:** రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి చూపుతూ భూసారాన్ని మెరుగుపరచే పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా మండల కేంద్రమైన కొల్చారంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో జానుము విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జానుము పంట భూసారాన్ని పెంపొందించడంలో, సేంద్రియ పదార్థాల శాతాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు పేర్కొన్నారు. రైతులు తమ వ్యవసాయ భూముల్లో జానుము సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు భవిష్యత్తు పంటలకు మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం కొల్చారం ఆగ్రో రైతు సేవా కేంద్రంలో తగినంత నిల్వలో జానుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డుతో కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. 40 కిలోల జానుము విత్తనాల సంచి రూ.3,110 ధరకు అందజేయబడుతుందని వెల్లడించారు. మండలంలోని రైతులు ఈ సబ్సిడీ పథకాన్ని వినియోగించుకుని జానుము సాగును ప్రోత్సహించాలని, మరిన్ని వివరాల కోసం వ్యవసాయ శాఖ అధికారులు లేదా ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.




# ఘనంగా 'మన ఊరు.. మన అంగన్‌వాడీ బడిబాట'

**తొగుట/సిద్దిపేట అర్బన్,/కొమురవెల్లి, మే 30, ప్రభాతవార్త :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన అంగన్‌వాడీ బడిబాట తొగుటలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీలేఖ చిన్నారుల విద్యా, ఆరోగ్యం, పౌష్టిక హారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న సేవలను సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని నాణ్యమైన ప్రాథమిక విద్య పోషకాహారం అందేలా సహకరించాలన్నారు. అనంతరం చిన్నారులకు సర్పంచ్ శోభ కొండల్‌రెడ్డి చేతుల మీదుగా యూనిఫాం అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తులో పునాదిగా నిలుస్తాయన్నారు. గ్రామ ప్రజలు అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారి తిరుపతి, వార్డు సభ్యులు పవన్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు అనిత, మాధవి, విజయ, వసంత, ఆయాలు, తల్లిదండ్రు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

**సిద్దిపేట అర్బన్‌లో...**

అంగన్‌వాడీ కేంద్రాలలో లభించే పౌష్టిక ఆహారాన్ని బాలింతలు, గర్భిణీలు తీసుకోవడంతో పాటు బడి ఈడు పిల్లలను పంపించి అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగంచేసుకోవాలని డిడబ్ల్యుఓ శారద అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం సిద్దిపేటలో ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఐసిడిఎస్ కార్యాలయం నుంచి పాత బస్టాండు అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టులో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చేలా చూడాలని టీచర్లకు సూచించారు. పౌష్టిక ఆహారంపై గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అందరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సూపరింటెండెంట్ సుమలత, అర్బన్ ఎంపిడివో మార్టిన్ లూథర్, పోషణ్ అభియాన్ అధికారి శ్రీనివాస్, ఎసిడిపిఓ తంజిమ్‌సుల్తానా, జయరామరాజు, శ్రీరామ్‌రెడ్డి, శ్వేత, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.




అంగన్‌వాడీ బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం

**కొమురవెల్లిలో...**

కొమురవెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యారంభోత్సవం కార్యక్రమాన్ని సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ జహీరాబాద్‌కు ప్రజలు సహకరించాలి

### కౌన్సిలర్ స్రవంతి నామరవి కిరణ్

**జహీరాబాద్ మే 30 ప్రభాతవార్త**

జహీరాబాద్ మున్సిపల్ 27వ వార్డులో సుభాష్ గంజ్ ప్రాంతంలో చెత్త సేకరణ, పారవేయడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి వార్డులో పాదయాత్ర చేస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ స్రవంతి నామరవి కిరణ్ గారు పాల్గొని వార్డు ప్రజలకు ముఖ్యమైన సూచనలు చేశారు. వార్డులోని వీధులు, డ్రైనేజీలు ఇతర బహిరంగ ప్రదేశాలలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడవేయకూడదని తమ వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇలా చెత్త వేయడం వల్ల రోగాలు ప్రబలే అవకాశం ఉందని వార్డు అందవిహీనంగా మారుతుందని వివరించారు. బదులుగా, ప్రతి రోజూ వార్డులోకి వచ్చే మున్సిపల్ చెత్త సేకరణ ఆటో ట్రక్కులకు మాత్రమే చెత్తను అందజేయాలని కోరారు. 'చెత్తను చెత్త బుట్టలో వేద్దాం.. మున్సిపల్ చెత్త బండికి అందిద్దాం!" అనే నినాదంతో రూపొందించిన బ్యానర్‌ను ఈ సందర్భంగా ప్రదర్శించారు. చెత్త వాహనాలు రాగానే క్రమం తప్పకుండా చెత్తను అందజేయడం వల్ల వార్డును స్వచ్ఛంగా ఉంచుకోవచ్చని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ నిబంధనలను పాటిస్తూ క్రమం తప్పకుండా చెత్త బండ్లకు చెత్త ఇస్తున్న ప్రజలను కౌన్సిలర్ స్రవంతి నామరవి కిరణ్ ప్రత్యేకంగా అభినందించారు. వార్డు ప్రజలందరూ సహకరిస్తేనే వార్డును స్వచ్ఛంగా ఆరోగ్యంగా ఉంచుకోగలమని కౌన్సిలర్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పర్యావరణ అధికారి రాజ్ కుమార్, జవాన్ శ్రీధర్, రిసోర్స్ పర్సన్ లక్ష్మి ‌ ృ వార్డు ప్రముఖులు స్థానిక ప్రజలు




చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్

### మానవత్వం చాటిన మున్సిపల్ కౌన్సిలర్లు...

## అనాథ శవానికి అంత్యక్రియలు

**రామాయంపేట, మే 30, ప్రభాతవార్త :**

కన్నవారెవరూ లేని ఓ నిరుపేద మహిళ మృతదేహానికి మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. రామాయంపేట పట్టణానికి చెందిన ఎరుకల విజయ అనే మహిళ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం నాడు తన గుడిసెలోనే కన్నుమూసింది. ఆమెకు కుటుంబ సభ్యులు, ఆప్తులు ఎవరూ లేకపోవడంతో మృతదేహం అనాథగా మిగిలింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు వెంటనే స్పందించి, కౌన్సిలర్లను ఆదేశించారు. దీంతో కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేవుని రంజిత్, పుట్టి సందీప్, గుగులోత్ రవి ముందుకు వచ్చి అన్నీ తామై అంత్యక్రియలు పూర్తిచేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన రాజకీయం. పదవులు ప్రజా సేవకే తప్ప ప్రదర్శనకు కాదు అని ఈ సందర్భంగా కౌన్సిలర్లు వ్యాఖ్యానించారు. అనాథగా మిగిలిన మహిళకు కొడుకులై నిలిచిన కౌన్సిలర్ల సేవను పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతల యాదగిరి, పోచమ్మల గణేష్, దాకి స్వామి, సాల్మన్ రాజు, తాహెర్, ఎల్లం, చిలుక విరాట్, పోచమ్మల భాను, సుధీర్ గౌడ్, అక్కల నరేందర్, దేవుని నరేష్, సోహెల్, కారు టాక్సీ డ్రైవర్ యూనియన్ సభ్యులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొని తమ వంతు సహాయం అందించారు.

## అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తులు పంపిణీ

**దౌల్తాబాద్, మే 30, ప్రభాతవార్త:**

దౌల్తాబాద్ మండలకేంద్రంలోని అంగన్‌వాడీకేంద్రంలో ఐదు సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులకు ప్రభుత్వంతరపున ఉచిత యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానికసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ సరోజ, సూపర్‌వైజర్ సౌమ్య హాజరయ్యారు. వారు తమ చేతులమీదుగా చిన్నారులకు నూతనదుస్తులను అందజేసి అభినందించారు. అనంతరం 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ టీచర్ కవితతో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వివోఏలు ఒంటికాలిపై నిరసన

**కుల్కచర్ల, మే 30, ప్రభాతవార్త:**

రాష్ట్రప్రభుత్వం విఓఏల సమస్యలను పరిష్కరించాలని ఒంటికాలిపై వినూత్న నిరసన తెలిపారు. శనివారం మండలకేంద్రంలోని విఓఏలు 13వరోజు సమ్మెను కొనసాగించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మెను నిర్వహిస్తామని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే పెద్దఎత్తున అందోళనచేస్తామని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో మండల విఓఏలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల కోసం ఒకే వేదికపై అఖిలపక్షం

**-డంపింగ్ యార్డుపై సమరశంఖం పూరించిన రాజకీయ పార్టీల మద్దతు**

**కొత్తూరు, మే 30, ప్రభాతవార్త:**

కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ జెపిదర్గాలో శనివారం భవిష్యత్ కార్యాచరణ కోసం 75మంది సభ్యులతో జేఏసీ ఏర్పాటుచేయటం జరిగింది. సిద్ధాపూర్ గ్రామ శివారులో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం మరింత బలపడుతోంది. కచరాకో రోకో... గావోంకో బచావో నినాదంతో జహంగీర్‌పీర్ దర్గాప్రాంగణంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశం ప్రజా ఐక్యతకు వేదికగా నిలిచింది. కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ఎమ్మార్పీఎస్, ఎల్‌హెచ్‌పీఎస్‌తో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు ఒకే వేదికపై చేరి డంపింగ్ యార్డు ప్రతిపాదనను వ్యతిరేకించారు. రాజకీయ భేదాలను పక్కనబెట్టి గ్రామాల భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అవసరమైతే అన్నిస్థాయిల్లో పోరాటం నిర్వహిస్తామని ప్రకటించారు. ఈసందర్భంగా ఉద్యమాన్ని సమన్వయం చేసేందుకు ఏర్పాటుచేసిన 75మంది సభ్యులతో కూడిన ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ)లో జేఏసీ చైర్మన్‌గా అంబటి ప్రభాకర్‌ముదిరాజ్, ట్రెజరర్‌గా ఎల్లారం శేఖర్‌రెడ్డి, కన్వీనర్లుగా గన్నెజు శ్రీధర్‌చారి, సయ్యద్ సిరాజ్, బీస సాయిబాబాలను ఎన్నుకున్నారు. ఇతర కీలకపదవులకు కూడా పలువురు నాయకులను నియమించారు. డంపింగ్‌యార్డు ప్రతిపాదనను విరమించుకునే వరకు ప్రజలతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని సమావేశంలో పాల్గొన్న నాయకులు ప్రకటించారు. సమావేశానికి నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతి నిధులు, రైతులు, యువత, మహిళలు, వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

## రసమయిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదు

**బెజ్జంకి, మే 30, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం పోరాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తున్న రసమయిపై కాంగ్రెస్ నాయకులు అర్థం, పర్థం లేకుండా విమర్శలు చేయడం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం చేసిన పనులు ఏమిటో ప్రజలకు వివరించాలన్నారు. రసమయి బాలకిషన్ 10 యేండ్లు ఎమ్మెల్యేగా ప్రజల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ నాయకులు బిఆర్ఎస్ నాయకులపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. రానున్నరోజుల్లో కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నిలదీస్తామన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు బెల్లం శ్రీధర్(పెద్దన్న), తాళ్లపల్లి భీమయ్య, బిగుళ్ల మోహన్, దుంబాల రాజ మహేందర్‌రెడ్డి, నరేష్ పటేల్, లక్ష్మారెడ్డి, మల్లేశం, శేఖర్‌బాబు, శివ, సుదర్శన్, తిరుపతి, పరశురాములు, మహేష్, ఓదెలు, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వివిధ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగహన

**కొండపాక, మే 30, ప్రభాతవార్త :** ఉపాధి హామీ కూలీలకు ఎండాకాలంలో తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలను కళ ప్రదర్శన ద్వారా అవగహన కల్పించారు. శనివారం కొండపాక మండల పరిధిలోని ఖమ్మంపల్లిలో జిల్లా కలెక్టర్, పౌర సంబంధాల శాఖ అధికారి బిజ్జురి రవికుమార్ అదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు కళాకారులు తెలిపారు. ఉపాధి కూలీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్ళి డ్రగ్స్, గంజాయి నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతతోపాటు, రోడ్డు భద్రత నియామాలు, ఎండాకాలంలో తీసుకోవాల్సిన తగు జాగ్రత్తలు తదితర ప్రభుత్వ పథకాలపై కూలీలకు అవగహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్ణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ తోళ్ల నర్సింలు, ఎఫ్ఎ సునీత, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, కొత్త మల్లయ్య, బాల్‌నర్సయ్య, అందె యాదయ్య, శ్రీకాంత్, కారోబార్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కళాకారుడు టీం లీడర్ పిల్లిట్ల శ్యామ్ సుందర్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

## మహాలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

**హుస్నాబాద్ రూరల్, మే 30, ప్రభాతవార్త :** మండలంలోని పందిళ్ల గ్రామంలోని శ్రీ మహాలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణ పనుల కోసం దాతలు ముందుకు వస్తూ తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం అమెరికాలో నివసిస్తున్న కొత్తమసు అశోక్ ఆలయ నిర్మాణానికి రూ.5,116 విరాళంగా అందజేశారు. ఇప్పటికే పలుమార్లు విరాళాలు అందించిన ఆయన, ఈ విరాళంతో కలిపి తొమ్మిది పర్యాయాలుగా మొత్తం రూ.46,044లను ఆలయ నిర్మాణ నిధికి బహూకరించారు. ఆలయ అభివృద్ధికి నిరంతరం సహకారం అందిస్తున్న శ్రీ కొత్తమసు అశోక్‌కు వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు, ఆ గ్రామ సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విరాళం బుర్ర గణేష్ (యూఎస్ఏ) మిత్రుల ద్వారా అందినట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. "దాతల సహకారంతోనే ఆలయ నిర్మాణం వేగంగా కొనసాగుతోందని. భక్తులు, దాతలు ఇదే విధంగా సహకరించాలని ఆలయ కమిటీ కోరింది.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం

**జగదేవ్‌పూర్, మే 30 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా పంచాయతీ కార్యదర్శిగా గర్నెపల్లి ప్రశాంత్ పనిచేస్తుండగా కొమురవెల్లి మండలం గుర్వన్నపేట గ్రామానికి బదిలీపై వెళ్తుండడంతో శనివారం గ్రామ సర్పంచ్ ఆలేటి కవిత లోలాకర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన పంచాయతీ కార్యదర్శి బదిలీపై వెళ్లడం బాధాకరమని, గ్రామానికి వారు అందించిన సేవలు మరువలేనివని, గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పట్ల అంకితభావంతో పనిచేసి ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ప్రజల మెప్పు పొందారని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఉపసర్పంచ్ యాదగిరి, ఆశా వర్కర్, అంగన్‌వాడీ కార్యకర్త, మాజీ సర్పంచ్ మాసపాక శకుంతల యాదగిరి, అక్కెనపల్లి నరసింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ జి.నరసింహారెడ్డి, నాయకులు బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో మానవులంతా సమానమే : ఎస్ఐ

**జగదేవ్‌పూర్, మే 30 (ప్రభాతవార్త):** సమాజంలో మానవులంతా సమానమేనని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండల పరిధిలోని అనంతసాగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కుల మత భేదాలు లేకుండా కలిసి మెలసి జీవించాలని అన్నారు. ప్రజలందరూ సమానమేనని, ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం హక్కులు కల్పించిందని, బాధ్యతాయుతంగా వాటిని వినియోగించుకోవాలని, అదేవిధంగా ప్రజలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సామాజిక సమస్యలను తగ్గించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని, యువత సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మల, అనంతసాగర్ సర్పంచ్ క్యాసారం కుమార్, తిమ్మాపూర్ సర్పంచ్ రాజు, దళిత సంఘం నాయకులు మరాఠి కృష్ణమూర్తి, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# హామీలకే పరిమితమైన ఎర్రచెరువు అభివృద్ధి

**రానున్న వర్షాకాలంలో చెరువు నిలువ సామర్థ్యానికి ఆగునా?.. లక్షలు ఖర్చు చేసినా ఫలితం శూన్యం... మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటు చేస్తామని చెప్పుతున్న అధికారం**

**గుమ్మడిదల మే 30 ప్రభాతవార్త**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రచెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి అంశం సంవత్సరాలుగా హామీలకే పరిమితమవుతూ వస్తోంది. అభివృద్ధి పేరుతో పలుమార్లు ప్రకటనలు, హామీలు చేసినప్పటికీ ఇప్పటివరకు పనులు మాత్రం ముందుకు కదలకపోవడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పిన నాయకులు, అధికారులు ఆ మాటలను ఆచరణలోకి తీసుకురావడంలో విఫలమయ్యారని గ్రామస్థులు మండిపడుతున్నారు. గతంలో చెరువు కట్ట ఎత్తు పెంచేందుకు లక్షల రూపాయల ప్రజా ధనం వెచ్చించి పనులు చేపట్టినప్పటికీ సరైన ప్రణాళిక, పర్యవేక్షణ లేకపోవడంతో ఆ పనులు ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయని చెరువు కట్ట ఒకవైపు కృంగి మట్టి కొట్టుకుపోయిన అలాగే వదిలేసారని స్థానిక రైతులు వాపోతున్నారు. అభివృద్ధి పేరుతో ఖర్చు చేసిన నిధులు వృథా అయ్యాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఎన్నికల సమయంలోనూ, సమావేశాల సందర్భంలోనూ ఎర్రచెరువు మినీ ట్యాంక్ బండ్‌ను ఆధునికంగా తీర్చిదిద్దుతామని, ప్రజలకు విశ్రాంతి తీసుకునే విహార స్థలంగా మార్చుతామని నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, ఆ హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎక్కడ వేసినా గొంగడి అక్కడే" అన్నట్లుగా సంవత్సరాలు గడిచినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడం ప్రజల్లో తీవ్ర నిరాశకు దారితీస్తోంది. ప్రజా ధనం ఖర్చు చేసి కూడా ఫలితం కనిపించకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని ఎర్రచెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను తక్షణమే ప్రారంభించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



లక్షలు వెచ్చించినా కుంగిపోయిన ఎర్ర చెరువు కట్ట దృశ్యం


**హెచ్చరిక నోటీసు**

సాధారణ ప్రజలందరికీ ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా, నా క్లయింట్ అయిన శ్రీ చాగర్లమూడి శ్రీనివాసరావు గారి తండ్రి, దివంగత శ్రీ చాగర్లమూడి వీరరాఘవయ్య కుమారుడు, సుమారు 87 సంవత్సరాల వయస్సు గల శ్రీ చాగర్లమూడి వెంకటరత్నం, ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండలం నివాసి, ప్రస్తుతం మానసిక బలహీనతతో బాధపడుతున్నారు మరియు తాను ప్రవేశించిన లావాదేవీల స్వభావాన్ని, పర్యవసానాలను అర్థం చేసుకోలేని స్థితిలో ఉన్నారు. అలాగే, నా చర్య, దస్తావేజు, పత్రం, ఒప్పందం లేదా లావాదేవీ యొక్క స్వభావాన్ని, ప్రభావాన్ని గ్రహించే లేదా అర్థం చేసుకునే స్థితిలో కూడా లేరు. సాధారణ ప్రజలు, బ్యాంకర్స్, ఫైనాన్షియర్లు, ప్రాపర్టీ డీలర్లు, డెవలపర్లు, బ్రోకర్లు, ఏజెంట్లు మరియు సంబంధిత వ్యక్తులందరూ, సదరు చాగర్లమూడి వెంకటరత్నం గారితో ఏదైనా చరాస్తి లేదా స్థిరాస్తికి సంబంధించి గానీ లేదా మరే ఇతర హక్కులు/అంతర్గత ఒప్పందాలకు సంబంధించి గానీ, ఎలాంటి అమ్మకం, అమ్మకపు ఒప్పందం, బహుమతి, తనఖా, లీజు, లైసెన్స్, రుణం, హామీ, పవర్ ఆఫ్ అటార్నీ, సెటిల్మెంట్, విడుదల, బదిలీ లేదా మరే ఇతర లావాదేవీ పత్రాలలోకి ప్రవేశించవద్దని ఇందు మూలముగా హెచ్చరించడమైనది. ఈ నోటీసు ఉన్నప్పటికీ శ్రీ చాగర్లమూడి వెంకటరత్నంతో వ్యవహరించే ఏ వ్యక్తి అయినా, అలా చేయడం వారి స్వంత పూచీ, ఖర్చు మరియు పరిణామాలకు బాధ్యత వహించవలసి ఉంటుంది. మరియు అటువంటి లావాదేవీ, పత్రం లేదా ఒప్పందం, అతను మానసిక అస్వస్థతతో ఉన్న కాలంలో కుదిరినట్లయితే, జరిమానాలకు లోబడి ఉంటుంది మరియు అతను మానసిక అస్వస్థతతో ఉన్నప్పుడు కుదిరినట్లయితే, చట్ట ప్రకారం అది చెల్లుబాటు కాదు. ఎందుకంటే ఒప్పందం కుదుర్చుకునే సమయంలో అతను మానసిక అస్వస్థతతో ఉన్నాడని నిర్ధారించుకోవడానికి అతనికి అర్హత లేదు. చాగర్లమూడి వెంకటరత్నం గారు అధికారికంగా చేసిన ఏ హామీ, సంతకం, అభ్యర్థన, అధికారం లేదా వాగ్దానంపై ఆధారపడరాదని అందరికీ తెలియజేయడమైనది.

**టి అమర్నాథ్**
**అడ్వకేట్**
చాంబర్ నంబర్స్ 305 & 310
రాఘవ రత్న టవర్స్, చిరాగ్ అలీ లైన్,
అబిడ్స్, హైదరాబాద్-500 001. TS
మొబైల్ నెం. 70327 81100/99480 59995
తేదీ: 29-05-2026



సిఐటీయూ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

## ఘనంగా సిఐటీయు ఆవిర్భావ దినోత్సవం

**కొండాపూర్, మే 30 (ప్రభాతవార్త):** సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని కొండాపూర్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యాలయం ముందు జెండా ఆవిష్కరించినట్లు సంఘం నాయకుడు కె.రాజయ్య తెలిపారు. సీఐటీయూ ఏర్పడి 56 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో సీఐటీయూ జెండాలను ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల హక్కుల సాధన కోసం సీఐటీయూ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ కార్మిక వర్గానికి అండగా నిలుస్తోందని రాజయ్య ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు ప్రవీణ్ కుమార్, గ్రామపంచాయితీ యూనియన్ నాయకులు విజేందర్, సంజీవులు, గోపాల్, యాదయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అంకిత భావంతో సేవలు అందించిన రాజబాబు : డిఇ



రాజబాబును సన్మానిస్తున్న డిఇ రామస్వామి, తదితరులు

**పటాన్‌చెరు, మే 30, ప్రభాతవార్త :** పదవీ విరమణ పొందిన ఇరిగేషన్ శాఖ ఉద్యోగి రాజబాబు అంకితభావంతో సేవలు అందించారని డిఇ రామస్వామి అన్నారు. శనివారం ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో జరిగిన రాజబాబు పదవీ విరమణ కార్యక్రమానికి ఉద్యోగులు హాజరై ఘనంగా సన్మానించారు.కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమానికి హాజరైన రాజబాబును అధికారులు పూలమాల శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డిఇ రామస్వామి మాట్లాడుతూ.. పదవి విరమణ పొందిన రాజబాబు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో మిగిలిన జీవితం గడపాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ విశ్వం, సిబ్బంది మధుసూదన్ రెడ్డి, రాజేష్, అశోక్, పాల్గొన్నారు

## మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలి : సిఐటియు



ఎంఈఓ వినతి పత్రం అందిస్తున్న మధ్యాహ్నం భోజనం కార్మికులు

**జహీరాబాద్, మే 30 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్ర సంస్థకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సీఐటీయూ జహీరాబాద్ పట్టణ కన్వీనర్ డి.మహేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న వందలాది మంది కార్మికుల ఉపాధికి అక్షయపాత్ర విధానం ముప్పుగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు వండి అందించే భోజనం ద్వారానే సరైన పౌష్టికాహారం అందుతుందని, అక్షయపాత్ర ద్వారా పంపిణీ చేసే ఆహారంతో ఆ లక్ష్యం నెరవేరదన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని కొన సాగిస్తూ ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులతోనే భోజనం తయారుచేసి విద్యార్థులకు అందించాలని కోరారు. కార్మికుల ఉపాధిని దెబ్బతీసే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ఓయస్, షహీదాబీ, అయేషా, హీనా, శ్యామల, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పౌరహక్కులు, చట్టాలపై అవగాహన



పౌరహక్కులు, చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్

**పాపన్నపేట, మే 30, ప్రభాతవార్త :** సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ నెలకొనేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శనివారం మండల పరిధిలోని బాచారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులు, విధులు, చట్టాల పట్ల అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తనహక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. సమాజంలో శాంతి, భద్రత, సామరస్యం నెలకొనేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. అలాగే సైబర్ నేరాలు, మహిళల భద్రత, అత్యవసర సేవల వినియోగంపై ప్రజలకు సూచనలు చేశారు. పౌరహక్కులపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొంగ పవిత్రదుర్గయ్య, రాము, గణేష్, శ్రీను, దుర్గయ్యతో పాటు యువకులు, గ్రామ ప్రజలు పోలీసులు ఆంజనేయులు, నాను, కిషన్, బస్వరాజ్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో ఘనంగా మహిళా వారోత్సవాలు

***నర్సాపూర్, మే 30, ప్రభాతవార్త :*** మండల సమైక్య కార్యాలయంలో శనివారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలోభాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్‌లో మహిళలతో ఉల్లాస్ అమ్మకు అక్షర మాల నినాదాలతో భారీ ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీలో అక్షరం ఆయుధం, ఇల్లాలు చదువు ఇంటింట వెలుగు అనే నినాదాలతో ఈ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు మరియు ఐకెపి సిబ్బంది ఏపిఎం సంగమేశ్వర్ సీసీలు నర్సింలు నాగరాజు రవీందర్, అకౌంటెంట్ మల్లేశం, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, మే 30, ప్రభాతవార్త :** నేటి తరం యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సూచించారు. పటాన్‌చెరు మండలం భానురు గ్రామంలో ఏర్పాటు చేసిన పిపిఆర్ వాలీబాల్ టోర్నమెంట్ ను శనివారం ఎమ్మెల్యే జీఎంఆర్ లాంచనగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. నేటి ఆధునిక జీవనశైలిలో యువత ఎక్కువ సమయం మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకే పరిమితం కాకుండా క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తి యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు భావనను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. నియోజక వర్గం వ్యాప్తంగా క్రీడ మైదానాలు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషిచేయాలని కోరారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలని వారు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, క్రీడాకారులు, క్రీడా పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ తదితరులు

## నర్సాపూర్‌లో అంగన్‌వాడీ బడిబాట

**నర్సాపూర్, మే 30, ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు పౌష్టికాహారం లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ అన్నారు. శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో మహిళా భద్రత వారోత్సవాల్లో భాగంగా అమ్మమాట అంగన్‌వాడీ బడిబాట ర్యాలీ నిర్వహించారు. నర్సాపూర్ చౌరస్తా నుండి ర్యాలీ తీసి బస్టాండ్‌లో మానవహారం చేపట్టారు. ర్యాలీని మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 3 నుండి 6 సంవత్సరాల పిల్లల్ని అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించాలని సూచించారు. నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్య చదువుకోవడం వల్ల వారి శారీరక అభివృద్ధితోపాటు మానసిక అభివృద్ధి మేధావికాసం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ హేమ భార్గవి, తహసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సాయికుమార్, ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి, ఎంఈఓ తారసింగ్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు శివకుమారి, సంతోషి మాత, మెహత, సంతోషి, అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాలు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నర్సాపూర్, మే 30, ప్రభాతవార్త :** నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో కోటి పది లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ మాజీ చైర్మన్ మురళీధర్‌యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్‌యాదవ్, కమిషనర్ సాయికుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్, సునీతబాల్‌రెడ్డి, పంబల లలితబిక్షపతి,అంతారం సుధీర్, నాయకులు షేక్ హుస్సేన్, కొత్త శ్రీనివాస్,, మేఘరాజ్, ధర్మారం, ఖదీర్, ప్రజాపతి, నయీమ్ బిగ్ తదితరులు పాల్గొన్నారు.

## జల హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి

### ఆలయ కమిటీ చైర్మన్ బిక్షపతిగౌడ్

**నర్సాపూర్, మే 30, ప్రభాతవార్త :** మండలంలోని పెద్ద చింతకుంట గ్రామ శివారులో వెలసిన జలహనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన జల హనుమాన్ కమిటీ చైర్మన్ క్నాట బిక్షపతి అన్నారు. శనివారం జల హనుమాన్ ఆలయంలో శ్రీ జలాంజనేయ స్వామికి పంచామృత అభిషేకం సింధూర లేపనం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించిన భక్తులు పాల్గొని అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం శ్రీ జల హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ కాటం బిక్షపతి గౌడ్ మాట్లాడుతూ గతంలో చిన్న ఆల్యయగా ఈ జల హనుమాన్ ఆలయం దినదినాభివృద్ధి చెందుతూ పుణ్య క్షేత్రంగా మారిందన్నారు. ఈ ఆలయ ఆవరణలో ఇప్పటికే భారీ హనుమాన్ విగ్రహం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, ఎల్లమ్మ దేవి ఆలయం వంటి ఉండగా ప్రస్తుతం శ్రీరామ మందిరం ఆలయాన్ని నిర్మించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఇందుకు దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ క్నాట బిక్షపతిగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు. జల హనుమాన్ ఆలయంలో విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ క్నాట బిక్షపతి గౌడ్ తదితరులు



మాట్లాడుతున్న బిక్షపతిగౌడ్



నర్సాపూర్. లోఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

## ఎరువుల దుకాణాలను అధికారుల తనిఖీ

**నర్సాపూర్, మే 30, ప్రభాతవార్త :** పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి దీపిక సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విత్తనాల నాణ్యతను, రికార్డులను పరిశీలించారు. దుకాణాదారులు లైసెన్సు కలిగి ఉండాలని, నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు.దుకాణదారులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులకు రికార్డులు అందజేయాలని స్టాక్‌రిజిస్టర్లు రోజువారీగా అప్డేట్‌చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**మాసాయిపేటలో...**



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**వెల్దుర్తి, మే 30, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మాసాయిపేటలోని ఆగ్రోస్ ఎరువుల దుకాణాన్ని శనివారం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఏవో కవిత, చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి, ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణంలో స్టాక్ రిజిస్టర్, లైసెన్స్ కాపీలు, బిల్లు పుస్తకాలు, విత్తన, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువులు. విత్తనాల విక్రయాలలో డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని. బిల్లు పైన రైతు సంతకాలు తీసుకోవాలని, స్టాక్ బోర్డు, ధరల పట్టిక, ప్రతిరోజు రాయాలని సూచించారు..

## హోటళ్లల్లో పరిశుభ్రత లేకుంటే కఠిన చర్యలు

### మున్సిపల్ కమిషనర్ సాయికుమార్

**నర్సాపూర్, మే 30, ప్రభాతవార్త :** హోటళ్లలో వండే ఆహార పదార్థాలలో నాణ్యత లోపిస్తే,పరిశుభ్రత లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ హెచ్చరించారు. శనివారం నర్సాపూర్ మున్సిపాలిటీలో గల వివిధ హోటలను మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంటలలో నాణ్యమైన వస్తువులు, పదార్థాలు వాడాలని సూచించారు. అలాగే వంట చేసే విధానం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. పాత ఆహారాన్ని మళ్లీ వేడి చేసి వినియోగదారులకు అమ్మడం లాంటి చర్యలు చేపడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అలాగే సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇంచార్జ్ ఉదయ్‌కుమార్,సిబ్బంది పాల్గొన్నారు




నర్సాపూర్‌లో హోటళ్లను తనిఖీచేస్తున్న మున్సిపల్ కమిషనర్ సాయికుమార్

# రామాయంపేట మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినియోగం

### బిజెపి నాయకుల ఆరోపణ.. జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు..

**రామాయంపేట, మే 30, ప్రభాతవార్త**

రామాయంపేట మున్సిపాలిటీలో ప్రజాధనం దుర్వినియోగమవుతోందని, టెండర్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ మెదక్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్‌రెడ్డి నేతృత్వంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 2006లో మున్సిపల్ నిధులతో నిర్మించిన 13 షాపుల సముదాయం లీజు గడువు 2026 నాటికి 20 ఏళ్లు పూర్తయినా, పాలకవర్గం, మున్సిపల్ కమిషనర్ కుమ్మక్కై రీ టెండర్ నిర్వహించకుండా కొనసాగిస్తున్నారని బీజేపీ ఆరోపించింది. పారదర్శకంగా రీటెండర్ నిర్వహిస్తే మున్సిపాలిటీకి రూ.3 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు అదనపు ఆదాయం వస్తుందని పేర్కొంది. అలాగే 15వ ఫైనాన్స్ కమిషన్ కింద వచ్చిన సుమారు రూ.3 కోట్లలో దాదాపు రూ.1.60 కోట్లు దుర్వినియోగమయ్యాయని, ఇటీవలి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ఖర్చుల పేరిట సుమారు రూ.30 లక్షలు వ్యయం చూపించి అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించింది. ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపి, 13 షాపులకు వెంటనే రీటెండర్ నిర్వహించాలని, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ప్రత్యేక విచారణ కమిటీ వేసి దుర్వినియోగమైన రూ.1.60 కోట్లను రికవరీ చేయాలని, ఎన్నికల ఖర్చుల పేరుతో జరిగిన ఆర్థిక అక్రమాలపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్‌గౌడ్, సీనియర్ నాయకులు వెల్మల సిద్దరాములు, అనిల్, యువమోర్చా నాయకుడు కటికే కార్తిక్, నితిన్, పట్టణ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**సదాశివపేట మే 30 ప్రభాతవార్త :** పేదల వైద్య సేవల కోసం ముఖ్యమంత్రి నిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. మండలానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ. 5,15,000, పట్టణానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు 2,49,000 మొత్తం 37 మంది లబ్ధిదారులకు 764000 రూపాయల సంబంధించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఎమ్మెల్యే నివాసంలో చింత ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల అధ్యక్షులు చీల మల్లన్న పెద్ద గొల్ల ఆంజనేయులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింత గోపాల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి మండల పార్టీ యువత అధ్యక్షులు నరేష్‌గౌడ్, కౌన్సిలర్లు పనికృష్ణ కళింపటేల్ విజయ్, నసీర్, సర్పంచులు తొంట కిష్టయ్య ప్రమోద్ మాజీ ఎంపిటిసి మాధవరెడ్డి మాజీ సర్పంచులు మాణిక్ కరుణాకర్ సంగమేశ్ పెద్ద గొల్ల శ్రీహరి సిద్ధన్న చంద్రన్న శేఖర్ రాములు సలావుద్దీన్ కరుణాకర్ మాజీ కౌన్సిలర్లు మోబిన్ సత్యం, తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆసరా పెన్షన్ లబ్ధిదారులకు ప్రత్యేక కెవైసి నమోదు

**సదాశివపేట, మే 30 ప్రభాతవార్త:** పట్టణంలోని 18వ వార్డులో ఆసరా పెన్షన్ లబ్ధిదారుల కోసం శనివారం ప్రత్యేక ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) ఆధారిత కేవైసీ నమోదు కార్యక్రమం నిర్వహించారు. పిట్టలకేరి వేపచెట్టు సమీపంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో పెద్ద సంఖ్యలో పెన్షన్ లబ్ధిదారులు హాజరై తమ వివరాలను ధృవీకరించుకున్నారు. వృద్ధులు, వికలాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి, సిబ్బంది సహకారంతో కేవైసీ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బిట్ల నికిత ప్రేమ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్‌ను నిరంతరాయంగా పొందాలంటే ప్రతి లబ్ధిదారుడు తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన వారు ఆధార్ కార్డు తీసుకుని జూన్ 15వ తేదీలోగా మున్సిపల్ కార్యాలయంలో కేవైసీ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఎల్లారంలో ఇందిరా మహిళా సమాఖ్య భవనం ప్రారంభం



ఇందిరా మహిళా సమైక్య భవనం ప్రారంభిస్తున్న దృశ్యం

**సదాశివపేట మే 30 ప్రభాతవార్త :** సదాశివపేట మండలం ఎల్లారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా సమాఖ్య భవనాన్ని సీడీసీ చైర్మన్ గడీల రామ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారం గ్రామ సర్పంచ్ చాట్ల మల్లేష్, వార్డు సభ్యులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, వెలుగు సీసీ శేఖర్, నాయక్, మైపాల్, డ్వాక్రా మహిళా సభ్యులు పాల్గొన్నారు. అలాగే నాగులపల్లి సర్పంచ్ శివానంద్‌గౌడ్, చందాపూర్ సర్పంచ్ మల్లేశం, మద్దికుంట సర్పంచ్ దేవిసింగ్, కంబాలపల్లి సర్పంచ్ భారతమ్మబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యూసుఫ్, బసవరాజ్, వార్డు సభ్యులు పట్నంశెట్టి శేఖర్, బేగరి మల్లన్న, కోహిరాంశెట్టి,ఎంబడి అంజన్న, చాకలి రాజు, బోయిని బసవరాజ్, జాయ్ యేసు రత్నం, దావయ్య, పెద్దింటి రామయ్య, పెద్దింటి రవి తదితరులు హాజరయ్యారు.

## కొనుగోలు కేంద్రాలను డిసివో తనిఖీ



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీఓ కరుణాకర్

**చిలిపిచెడ్, మే 30 ప్రభాతవార్త :** మండలంలోని అజ్జమర్రి, బండా పోతుగల్, ఫైజాబాద్, చిలిపిచెడ్ గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శనివారం డీసీఓ(జిల్లా సహకార అధికారి) కరుణాకర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పర్యవేక్షించారు. వర్షంతో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ, లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలు జాప్యం అయిందని,సకాలంలో ధాన్యాన్ని తరలించడానికి లారీల కొరత లేకుండా చూస్తామని, ట్రాక్టర్లు ఉన్న రైతులు ధాన్యాన్ని ట్రాక్టర్లలో మిల్లులకు తరలించాలని, మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రైతులు ఎలాంటి అపోహలు నమ్మొద్దని, సాధ్యమైనంత త్వరగా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలనీ, కొనుగోలు ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు రవాణా చేయడం, గన్ని సంచులు నిల్వలను పర్యవేక్షించాలని సొసైటీ సీఈఓ దత్తాత్రికి సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ దత్తాత్రి, నర్సింలు, రైతులు రాఘవరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీయాక్ట్ కేసు నమోదు

### ఎస్ఐ నర్సింహులు

**చిలిపిచెడ్, మే 30 ప్రభాతవార్త**

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని ఎస్సై నర్సింలు అన్నారు. శనివారం మండల కేంద్రమైన చిలిపిచెడ్ అగ్రోస్ రైతు సేవా కేంద్రంను మండల టాస్క్‌ఫోర్స్ మండల వ్యవసాయ రాజశేఖర్ గౌడ్,ఎస్సై నర్సింలుతో తహశీల్దార్ ఎండి.జహీర్‌లు కలిసి తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై నర్సింలు మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు, అమ్మకూడదని, ఒక వేళ అమ్మినట్లయితే పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏఓ రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని, నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు రైతులు ప్రభుత్వం నుండి అనుమతి పొందిన తన దుకాణాలలో మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. దుకాణాలలో నిల్వ ఉన్న విత్తనాలను పరిశీలించి వాటికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.ఎమ్మార్వో మాట్లాడుతూ రైతులకు మంచి నాణ్య మైన విత్తనాలను, పురుగు మందులను సకాలంలో అందించవలసిందిగా డీలర్స్‌కు సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకుడు శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



విత్తనాల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు